క్లుప్తంగా

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

అశ్వాపురం: మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం ఎస్సై సురేష్‌కుమార్ హెచ్చరించారు. సీఐ రవీందర్ ఆదేశాల మేరకు ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు మండలంలో పలు చోట్ల సోమవారం మావోయిస్టుల ఫొటోలతో కూడిన పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మావోయిస్టులపై ఉన్న రివార్డులను వారి ఆచూకి తెలిపిన వారికి ప్రభుత్వం తరుపున ఇస్తామన్నారు. ఆచూకి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలోని రేయ్‌ఆఖా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బేతేల్ ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీపీ సున్నం లలిత సోమవారం ప్రారంభించారు. మూడు నెలల పాటు మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కుట్టుమిషన్ శిక్షణ నిర్వాహకుడు పాస్టర్ జాన్సన్ తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడా పద్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్ హామీలు

భద్రాచలంటౌన్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ కార్డులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భద్రాచలం ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు పోలింగ్ బూత్ ఏజెంట్లు, ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రతి గడపగడపకూ వెళ్లి పథకాలను వివరించాలని సూచించారు. సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ పరమేశ్వర నాయక్, మండల అధ్యక్షుడు నరేష్, బుడగం శ్రీనివాస్, నల్లపు దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, సతీష్, మహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

మణుగూరురూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెలో భాగంగా సోమవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మెపై రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, లక్ష్మి, శ్యామల, మల్లీశ్వరి, పి.విజయకుమారి, హేమలత, అరుణ, హెల్పర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై వరద



కాలువను తలపిస్తున్న వంతెన రోడ్డు

ములకలపల్లి: ఈ దృశ్యం చూసి వాహనాలు కాలువ దాటుతున్నాయనుకుంటే పొరపడినట్లే. రాజుపేట శివారులోని పాములేరు వాగు వంతెనపై బీటీ రోడ్డు కోతకుగురై గుంతలమయంగా మారింది. వర్షాలు వస్తే గుంతల్లో నీళ్లు నిలిచి, కాలువను తలపిస్తోంది. పాల్వంచ -మండలపల్లి రహదారిపై నిర్మించిన ఈ బ్రిడ్జి గుండా నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. నీటి నిల్వతో గోతుల్లో దిగి, ఆటోలు, ద్విచక్ర వాహనాలుదారులు ఇబ్బందులకు గురౌతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ

అశ్వాపురం: పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మండల పరిధిలోని జగ్గారం గ్రామంలోని ఆరీఫా–రోష్ని వృద్ధాశ్రమంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆ పార్టీ జిల్లా నాయకుడు భూక్యా తారాప్రసాద్ వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మొండికుంటలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా చిత్ర పటానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఐకార్ సభ్యుడు ముస్కు శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, సోషల్ మీడియా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, కల్లూరి రామారావు, లింగారెడ్డి, గంగారెడ్డి, సురేష్, రాము, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ములకలపల్లి: మండలపరిధిలోని తిమ్మంపేట, పొగళ్లపల్లి మీదుగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్రనేత నరాటి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లారీలలో పరిమితికిమించి ఇసుక రవాణా చేయడం ద్వారా రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ధ్వజమెత్తారు. ఓవర్‌స్పీడ్‌తో వస్తున్న లారీలతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారని అన్నారు. ఈ ఉదంతంపై ఫిర్యాదు చేస్తున్న వారిని కొందరు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.

నూతన గ్రంథాలయం రెడీ

- మణుగూరులో నిర్మితమైన పఠనాలయం
- త్వరలోనే ప్రారంభానికి సిద్ధం
- పుస్తక ప్రియులు, విద్యార్థులకు ప్రయోజనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మణుగూరు శాఖ గ్రంథాలయం

మణుగూరురూరల్: మణుగూరు మండలంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నూతన శాఖ గ్రంథాలయ నిర్మాణం దాదాపుగా పూర్తయింది. త్వరలోనే అధికారికంగా ప్రారంభించనున్నారు. దీంతో పుస్తక ప్రియులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ప్రయోజనం చేకూరనుంది. మణుగూరులో గ్రంథాలయ నిర్మాణం కోసం ప్రత్యేక కృషి చేశారని పలువురు పుస్తక ప్రియులు అభివర్ణించారు.

మణుగూరులో గ్రంథాలయం ఏర్పాటైతే విద్యార్థులకు, పుస్తక ప్రియులకు బాగుంటుందని మండల ప్రజలు గత కొన్నేళ్లుగా ఎదురు చూశారు. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం వరస నోటిఫికేషన్లు వేయడంతో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవ్వాల్సిన యువత సైతం గ్రంథాలయ కొదువను గుర్తించింది. వేలు ఖర్చు పెట్టుకుని పుస్తకాలు కొనుగోలు చేయలేని వారికి దీని అవసరత మరింత స్థాయిలో ఉంది. గ్రంథాలయం ఉంటే అక్కడ పుస్తకాలను వినియోగించుకోవడంతోపాటు, చదువుకోడానికి ప్రత్యేక స్థలం చేకూరినట్లు అవుతుంది. ఈ నేపథ్యంలో మణుగూరులో గ్రంథాలయ ఏర్పాటుకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవ తీసుకున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసి సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో నిర్మాణం పూర్తి చేశారు. త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఎన్నికల కోడ్ వచ్చేలోపే గ్రంథాలయాన్ని ప్రజలకు చేరువచేయాలని అధికారులు కృషి చేస్తున్నారు. నూతనంగా నిర్మించిన గ్రంథాలయంలో ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడే అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచడానికి అధికారులు సిద్ధమయ్యారు.

విజ్ఞానం పెంపుదలకు అవకాశం



గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల వల్ల విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు. పుస్తకాలు చదవడానికి సమయం కేటాయించడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ప్రపంచంలో ఉన్న ఆసక్తికర విషయాలను తెలుసుకోవచ్చు. అలాంటి గ్రంథాలయాన్ని స్థానికంగా ఏర్పాటు చేయడం హర్షనీయం.

– వీవీ కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు

లాభాలెన్నో..



మణుగూరు మండలంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయం వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. సరైన పద్ధతిలో గ్రంథాలయాన్ని జ్ఞానవిజ్ఞానం పెంపొందుతుంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు మరింత ఉపయోగపడుతుంది. తొందరలోనే మణుగూరులో గ్రంథాలయ ప్రారంభోత్సవం జరుగుతుంది.

– ఎడ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ ప్రచార కార్యదర్శి

సమ్మె నోటీసులు అందజేత



బూర్గంపాడు: ఎంపీడీఓ, ఎంపీఓకు నోటీస్ అందిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

మణుగూరురూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగుతున్నట్లు పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సోమవారం మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు మాట్లాడుతూ.. ఈ–పంచాయతీ ప్రాజెక్ట్ కింద తాము పదేళ్లగా కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్నామని, తమకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామపంచాయితీల కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీఓ షాబ్నాకు పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పేస్కేల్ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము,కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: పంచాయతీ రాజ్ శాఖ సాంకేతిక వ్యవస్థలో 9 ఏళ్లుగా పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు తమ సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ ముత్యాలరావుకు వినతిపత్రం, సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు చంద్రకళ, చిరంజీవి, విష్ణు, రాజేష్, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న తమకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు కోరారు. సోమవారం ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల నిర్వహణలో కీలకంగా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

చండ్రుగొండ: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఎంపీడీఓ రేవతి, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌లకు కంప్యూటర్ ఆపరేటర్లు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం బాధ్యుడు ఎస్‌కె.ఫారుక్, కె.రాజు, జి.నవ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని పలు కాలనీల్లో నేడు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పట్టణంలోని కొర్రాజులగుట్ట, చర్ల రోడ్డు, ఏఎంసీ కాలనీ, భగవాన్ దాస్ కాలనీ, రాజుపేట కాలనీ, జగదీష్ కాలనీ, ఐటీడీఏ రోడ్, సుందరయ్య నగర్, రాజీవ్ నగర్ ఏరియాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడునుందన్నారు. వినియోగదారులు సహకరించాలని భద్రాచలం విద్యుత్ శాఖ ఏఈ రాజారావు ఓ ప్రకటనలో కోరారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

అశ్వాపురం: మండలంలో తక్షణమే ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో సోమవారం దండి రాములు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఆధార్ నమోదు కేంద్రం లేక 24 గ్రామ పంచాయతీల ప్రజలు మణుగూరు, సారపాక, భద్రాచలం వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. సమావేశంలో నాయకులు మోకాళ్ల రమేష్, పాయం నరసింహారావు, తూము వెంకన్న, అశోక్‌రెడ్డి, రాఘవులు, రామయ్య, సుధాకర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా గడపగడపకూ పాదయాత్ర కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు 13వ రోజు కమలాపురం, అన్నారం గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయబోయే ఆరు గ్యారెంటీ కార్డులను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవిరావు, ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, తాటి భిక్షం, పాల్వంచ రాములు, పాతూరి వెంకన్న, చింతల కృష్ణ, మాదాడి రాజేశ్, నగేశ్, మహేశ్, మానస, అనిత, శ్యామల, పద్మ తదితరులు ఉన్నారు.

అవగాహన పెంచాలి

బూర్గంపాడు: విద్యార్థులకు హిందు ధర్మంపై అవగాహన పెంచాలని పరుశురామ్ పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తవరపు రాజశేఖర్ అన్నారు. సారపాకలోని గణపతి నవరాత్రి ఉత్సవ మండపాలలో సోమవారం విద్యార్థులకు పరుశురామ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పరుశురామ్ పరివార్ జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి సాయికిరణ్, కరకు ప్రసాద్, బిజ్జం అశోక్‌రెడ్డి, రాఘవ, విజయ్, అనిల్, యోగానందరెడ్డి పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చనలు, దూపదర్శనం, నాగహారతి తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

విధుల్లో చేరిన హెచ్‌ఎంలు



అశ్వారావుపేట బాలుర పాఠశాల హెచ్‌ఎం హరితను సన్మానించిన ఉపాధ్యాయులు

అశ్వారావుపేటరూరల్: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా అశ్వారావుపేట మండలానికి నలుగురు ప్రధానోపాధ్యాయులు రాగా.. సోమవారం వారంతా విధుల్లో చేరారు. అశ్వారావుపేట జెడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలకు జి.హరిత, మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం జెడ్పీఎస్ఎస్‌కు టిఐప్రసాదరావు, నారాయణపురం జెడ్పీఎస్ఎస్‌కు ఆర్.పద్మావతి, అచ్యుతాపురం జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు ఎస్‌కె.షాహీన బేగం బదిలీలపై రాగా.. ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. అదే విధంగా మండలంలోని నారాయణపురం జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పీజీ హెచ్‌ఎంగా బాధ్యతుల నిర్వహిస్తున్న పి.కృష్ణయ్యకు కొత్తగూడెం మండలం చాతకొండ జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు బదిలీ అయింది. ఇప్పటి వరకు మండలంలో ఒక్కరే పీజీ హెచ్‌ఎంగా పి.కృష్ణయ్య పని చేయగా, మిగిలిన అన్ని పాఠశాలల్లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలతోనే సాగింది. తాజాగా విధుల్లో చేరిన నలుగురు హెచ్‌ఎంలు కూడా పీజీ హెచ్‌ఎంలే కావడంతో ఆ కొరత తీరింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయా హెచ్‌ఎంలను తోటి ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానాలు చేశారు.

ఆశా వర్కర్ల సమ్మె



అశ్వారావుపేటరూరల్: ఆశా వర్కర్ల సమ్మెలో మాట్లాడుతున్న పిట్టల అర్జున్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు సోమవారం పలు చోట్ల సమ్మె చేపట్టారు. తమపై పనిభారం తగ్గించడంతోపాటు కనీస వేతనంగా రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఏ, డీఏలు ఇవ్వాలని, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. పలువురు నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి తమ మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



ములకలపల్లి: సంఘీభావం ప్రకటిస్తున్న రాంబాబు



దుమ్ముగూడెం: సమ్మె శిబిరంలో ఆశా వర్కర్‌లు

సమగ్ర అభివృద్ధే ఆశయం



సీసీరోడ్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి: అశ్వారావుపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ప్రధాన ఆశయంగా ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలపరిధిలో రూ 2.11 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక సర్పంచ్‌లతో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. వివిధ గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో పర్యటించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చొరవతో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కాగా ఎమ్మెల్యే కార్యక్రమం ఆసాంతం ఎన్నికల ప్రచారం మొదలైందా అన్నట్లుగా సాగింది. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించగా, ద్విచక్ర వాహనాలకు బీఆర్‌ఎస్ జెండాలు రెపరెపలాడాయి. జగన్నాథపురం మెయిన్ సెంటర్‌లో గజమాల వేసి ఎమ్మెల్యే మెచ్చాకు స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఎంపీపీ మట్ల నాగమణి, ఎంపీటీపీ శనగపాటి మెహరమణి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అశ్వాపురం: మండల పరిధిలోని ఆనందాపురం గ్రామానికి చెందిన వల్లపు గోపి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అతని కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. 2002–03 సంవత్సరంలో అశ్వాపురం జెడ్పీ స్కూల్‌లో గోపితో చదువుకున్న తోటి స్నేహితులు సోమవారం రూ.25 వేలను గోపి భార్య చంద్రకళకు అందజేశారు. కార్యక్రమంలో ఉపేందర్, దొడ్డా ప్రదీప్, అలవాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి..

భద్రాచలంఅర్బన్: ఆటో డ్రైవర్ పండగ నాగేంద్రబాబు డెంగ్యూ జ్వరంతో ఈనెల 1న మృతి చెందగా.. సోమవారం భద్రాద్రి టౌన్ జేఏసీ కొత్త మార్కెట్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.10వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమానికి జీవన్ హాస్పటల్ అధినేత కృష్ణ ప్రసాద్, భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావులు హాజరయ్యారు. అనంతరం డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. మృతుడు నాగేంద్ర బాబు భార్య గర్భిణితో ఉందని, ఆమె ప్రసవించే వరకు తమ హాస్పటల్లోనే పూర్తి వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకుంటే కుటుంబానికి బాసటగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో భద్రాద్రి టౌన్ జేఏసీ కొత్త మార్కెట్ ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: మండల పరిధిలోని సమితిసింగారం, అశోక్‌నగర్, బండారుగూడెం ప్రాంతాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రికార్డులను అప్‌డేట్ చేస్తుండాలని, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, రవి, హిమబిందు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనుల సర్వే

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో నూతనంగా తలపెట్టిన సెంట్రల్ లైటింగ్ పనులకు సంబంధించిన సర్వేను ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావు సోమవారం చేపట్టారు. పనులు చేపట్టేందుకు ముందుగా మిషన్ భగీరథ పైపులు, విద్యుత్ స్తంభాల తొలగింపు కోసం సంబంధిత అధికారులతో చర్చించారు. త్వరలోనే మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మానాయక్, మిషన్‌భగీరథ ఏఈ సాయికృష్ణ, విద్యుత్ ఏఈ తరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

భద్రాచలంఅర్బన్: చర్ల మండలంలోని పుసుగుప్ప గ్రామంలో వేస్తున్న రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, తునికాకు బోనస్ విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి కారం నరేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పుసుగుప్ప గ్రామస్తులతో కలిసి సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యుడు దొడ్డి హరినాగవర్మ మాట్లాడారు. కార్యక్రమంలో రామకృష్ణ, ధర్మయ్య, ప్రదీప్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో సిబ్బంది కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బట్టా విజయ్‌గాంధీ ఆరోపించారు.

సోమవారం పీహెచ్‌సీని సందర్శించిన ఆయన.. జ్వరాలతో రోగులు పెద్దసంఖ్యలో ఆస్పత్రికి వస్తుంటే సిబ్బంది సరిపడా లేకపోవటంతో రోగులకు వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ఈ విషయాన్ని ఫోన్‌లో డీఎంఅండ్‌హెచ్ఓకు తెలిపారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్యసేవలను నిరంతరం కొనసాగించాలని కోరారు.

వినాయకుడికి మహా నైవేద్యం



అశ్వారావుపేటరూరల్: గణనాథుడికి సమర్పించిన నైవేద్యాలు



సంప్రదాయ నృత్యాలు చేస్తున్న చిన్నారులు

అశ్వారావుపేటరూరల్: గణపతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో కొలువుదీరిన గణనాథునికి సోమవారం రాత్రి భక్తులు మహా నైవేద్యాన్ని సమర్పించారు. ముందుగా వినాయకుడికి ఘనంగా పూజలు చేసి, దాదాపు 250 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధికంగా తరలిరాగా, బస్టాండ్ సెంటర్, ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అనంతరం నైవేథ్యాలు సమర్పించిన మహిళలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

అశ్వారావుపేటరూరల్: వినాయక చవితి సందర్భంగా అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ లక్ష్మి గణపతి ఆలయం ఆధ్వర్యంలో కూచిపూడి, భరత నాట్యం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన కూచిపూడి, భరత నాట్యం నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా సందడి నెలకొంది. అనంతరం చిన్నారులకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేయగా.. వీటిని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తోకల హరీష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

బూర్గంపాడు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాలలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారపాకలోని వర్తకసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నదానం..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలోని గోదావరి కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం వినాయకమండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ కోడి కృష్ణవేణి ప్రారంభించారు. సర్పంచ్ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నల్లపాటి రాము, కవిత దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చర్లరూరల్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చర్ల రఘు థియేటర్ రోడ్డులోని పద్మశాలి బజారు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి మండపం వద్ద సోమవారం భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. చర్ల సీఐ బి.రాజగోపాల్, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావులు ప్రారంభించారు. బొజ్జా తాతారావు, తోటపల్లి శ్రీను, శెట్టి రాజా, దొడ్డి సూరిబాబు, చిన్నారి, గద్దం సాయి, గోరింట్ల వెంకటేశ్వరరావు, నరసింహారావు, బబ్లూ, బాచి, రుద్ర కుమార్ పాల్గొన్నారు.